క్లుప్తంగా

యాజమాన్య పద్ధతిలో మిర్చి నారుమళ్లు



పెదకూరపాడు: యాజమాన్య పద్ధతిలో మిర్చి నారుమళ్లు పెంచుకోవాలని ఉద్యానశాఖాధికారి శ్రీనిత్య సూచించారు. మండలంలోని బలుసుపాడు, 88 త్యాళ్లూరు గ్రామాలలో గురువారం ఆమె నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. నారు పెంచే విధానం, కలుపు నివారణకు తీసుకోవలసిన చర్యలను గురించి వివరించారు. నర్సరీలలో జవాబుదారీ విధానం ఉండాలని, రిజిష్టర్లు మెయింటేన్ చేయాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



పెదకూరపాడు: ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న పెదకూరపాడుకు చెందిన విద్యార్థి వెంకట నాగజస్వంత్‌కు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం కావలసిన ల్యాప్‌టాప్‌ని మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధి మాగులూరి భానుప్రకాష్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారిని మాగులూరి ఫౌండేషన్ ఆదుకుంటుందని చెప్పారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు, ఆర్తిమళ్ల రమేష్, మాగులూరి కృష్టారావు, కొండవీటి ప్రసాద్, కుంచనపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసేవకుల ధర్నా



నకరికల్లు: గ్రామసేవకుల పేస్కేల్‌ను తక్షణమే అమలు చేయాలని గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారిని గ్రామసేవకులుగా గుర్తించాలని, అర్హులైన వారికి వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్ పోస్టుల్లో ఉద్యోగోన్నతి కల్పించాలని, డీఏ రికవరీ నిలిపి డీఏతో కూడిన వేతనం అమలు చేయాలని అన్నారు. కార్యదర్శి ఇనుముక్కల యాకోబు, మరియమ్మ, కొత్తపల్లి సీతయ్య, కోటేశ్వరరావు, చిన కోటేశ్వరరావు, ఆదం సాహెబ్, కనకయ్య, ఇనుముక్కల కోటయ్య పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం: వీఆర్‌ఏల జీతాలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు పిచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు జీతాలను పెంచాలని గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరి చేసే వీఆర్‌ఏల జీతాలను ఇచ్చిన మాట ప్రకారం పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వీఆర్‌ఏల డివిజన్ కమిటీ సభ్యుడు సంజీవరావు, మండల అధ్యక్షుడు సిద్ధయ్య, వీఆర్‌ఏలు యాకోబు, అన్నమ్మ, కోటమ్మ, విజయ్, సుభాని, హుస్సేన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖకు డీఎస్పీ మచ్చ తెస్తున్నారు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పోలీస్ శాఖకు సత్తెనపల్లి డీఎస్పీ మచ్చ తెస్తున్నాడని, డీఎస్పీగా కాకుండా అంబటి గుమాస్తాగా పనిచేస్తున్నాడని టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ ఘాటు విమర్శలు చేశారు. గురువారం సత్తెనపల్లిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కన్నా మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విస్తృతంగా దొరుకుతుందని, పిల్లలు గంజాయి మత్తులో భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారని, గంజాయిని అరికట్టాలని డీఎస్పీకి వినతిపత్రం ఇచ్చినా చర్యలు ఉండవనే ఉద్దేశంతో ఏపీ డీజీపీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అంబటి రోడ్డు కూడా వేయించలేకున్నారని, తాము భిక్షాటన చేసి అయినా రోడ్డు వేయిస్తామన్నారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): దుకాణాల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ అరుణ చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని దుకాణాల నిర్వాహకులతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో అరుణ మాట్లాడుతూ కొనుగోలు దారులకు బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. దుకాణంలో ఉన్న సరుకుల వివరాలు, నాణ్యత, ధరలు సూచిస్తూ స్టాక్‌బోర్డ్ ను ఏర్పాటు చేయాలని, కాటా సరిగ్గా నిర్వహించాలన్నారు. దుకాణం పైన డిస్‌ప్లే బోర్డును మూడు రోజుల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ జాన్‌సైదా పాల్గొన్నారు.

క్రియాశీలక పాత్ర పోషించాలి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- మూడు మండలాల బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం
- ఉత్తమ ఏజెంట్లకు సన్మానం



బూత్ లెవల్ ఏజెంట్లకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: బూత్ లెవల్ ఏజెంట్లు క్రియాశీలక పాత్ర వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు బీఎల్‌ఓలతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికీ తిరగవచ్చన్నారు. ఈనెల 21 నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా ప్రకారం పరిశీలన చేస్తారన్నారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ బూత్ లెవల్ ఏజెంట్లు కూడా ఇంటింటికీ తిరగాలన్నారు. మీ దగ్గర ఉన్న జాబితా ప్రకారం ప్రతి ఇంట్లో ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మన ధైర్యం..

పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి బాట పట్టించామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి, వారి ఆదరణ చూరగొన్నామన్నారు. సీఎం జగనన్నే మన ధైర్యం, మనం చేసిన పనులే మనకు భరోసా అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్ లెవల్ ఏజంటక్లు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, బూత్ లెవల్ ఏజంట్లు ఏ సమాచారమైనా అందులో పోస్టు చేయాలన్నారు. దానిని చూసితాను వెంటనే స్పందిస్తానని, అవసరమైతే ఆ గ్రామానికి కూడా వస్తానని అన్నారు. ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు వాట్సాప్ గ్రూప్‌లో అందుబాటులో ఉంటానని చెప్పారు. తొలుత టీం జగనన్న యాప్‌లో బాగా కృషి చేసిన నియోజగవర్గం నుంచి ఎంపికైన ఐదుగురు ఏజెంట్లు వెలతోడి చిన్నబ్బాయి, సందెపోగు లింకన్, సోము వెంకట్రామిరెడ్డి, బి.నాగేశ్వరరావు, దేగల శ్రీనులను అభినందిస్తూ సర్టిఫికెట్లు అందచేశారు. ఎంపికైన వారికి ముఖ్యమంత్రిని కలుసుకునే అవకాశం వస్తుందని చెప్పారు. ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ గఫూర్, పార్టీ క్రోసూరు మండల కన్వీనర్ వెలది అప్పారావు, చిలకా చంద్రయ్య, అబ్దుల్ ఖాదర్, ఎక్కిరాల మురళి, రంగయ్య, అబ్దుల్‌రహీం, పల్లప్రోలు వెంకటరెడ్డి, మర్రి కోటిరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, డాక్టర్ షరీఫ్, అనుమల కోటిరెడ్డి, డాక్టర్ షరీఫ్, బెల్లంకొండ కన్వీనర్ ఓర్చు సాంబశివరావు, మర్రి ప్రసాదరెడ్డి, గాదె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటు నమోదు ఇంటింటి సర్వే

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నుంచి ప్రత్యేక సమ్మరి రివిజన్‌లో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఓటు నమోదుకోసం ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ కట్టికోట పుల్లారావు తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, బూత్‌స్థాయి అధికారులు(బీఎల్‌ఓ) వారి పరిధిలోని ప్రతి ఇంటికి ఖచ్చితంగా వెళ్లి అర్హత ఉన్న వారికి ఓటు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సరిచేయడంలో భాగంగా ఈ నెల 21 నుంచి ఆగష్టు 21వరకు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. బీఎల్‌ఓలు ఎప్పటికప్పుడు ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందచేయాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 40,584 మంది ఓటర్లు, కాగా వారిలో పురుషులు 19,621 మంది, మహిళలు 20,960 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారని తెలిపారు.

మాచవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత బూల్ లెవెల్ ఆఫీసర్లదని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వి.భూషణం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటు నమోదు కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టి చేర్పులు, మార్పులు, తొలగింపులను ఆయా కుటుంబాల ఆమోదం మేరకు సవరించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా ఓటరు జాబితాలను తయారు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఈ-పంట' యాప్‌పై అవగాహన

క్రోసూరు: క్రోసూరు రైతుభరోసా కేంద్రం-1లో గురువారం పంట నమోదు యాప్‌పై మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి, గ్రామ రెవెన్యూ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ హనుమంతరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 2023 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ పంట నమోదు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ-పంట ద్వారానే రైతులకు మద్దతు ధర, పంట నష్టపరిహారం, సున్నావడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా వంటి పథకాలు అందుతాయన్నారు. అనంతరం ఏఓ వి.వేణుగోపాల్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది, రైతుభరోసా కేంద్రం సిబ్బంది సమన్వయంతో ఈ-పంట నమోదు చేయాలన్నారు. కౌలు రైతులందరికీ తప్పని సరిగా కౌలు గుర్తింపు కార్డులివ్వాలని చెప్పారు.

కందిపంట విస్తీర్ణం పెంచాలి

చిలకలూరిపేటటౌన్: కందిపంటలను ఇతర పంటల్లో అంతరపంటగా సాగుచేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. గురువారం మండలంలోని మానుకొండవారిపాలెం గ్రామంలో రైతులకు కంది సాగు, చిరుధాన్యాల వ్యాప్తి పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంది విస్తీర్ణం తగ్గిపోవడంతో కందిపంటను అధిక విస్తీర్ణంలో సాగు చేయాలని సూచించారు. చేను గట్లపై కంది సాగు చేసి మంచి యాజమాన్య పద్ధతులు ఆచరించి దిగుబడి పెంచాలన్నారు. కందిపంటలో వచ్చు ఎండు తెగులు నివారణకు ట్రై కోడెర్మాతో విత్తన శుద్ధి చేయాలని సూచించారు. అనంతం రైతులకు కందివిత్తనాలు అందజేశారు. మానవవనరుల కేంద్రం డీడీఏ ఎం. శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, చిలకలూరిపేట ఏవో శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమై జీవితకాలం పోరాడారు



సీఆర్ మోహన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితకాలం శ్రమించిన మహోన్నత వ్యక్తి సీఆర్ మోహన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ చెప్పారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు సీఆర్ మోహన్ ద్వితీయ సంస్మరణ సభ గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన నాయకుడిగా సీఆర్ మోహన్ కమ్యూనిస్టు పార్టీలు చివరి కొనసాగారని తెలిపారు. జీవించినంత కాలం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించిన సీఆర్ ఎందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నా రు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జాతీ య కార్యదర్శి షేక్ గని, పల్నాడుజిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

- వాడవాడలా జగనన్న సురక్ష క్యాంపులు
- అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



సత్తెనపల్లిలో ధ్రువపత్రాలు అందిస్తున్న కమిషనర్ షమ్మీ, కౌన్సిలర్లు



బొల్లవరంలో ధ్రువపత్రం అందిస్తున్న ఎంజేఎం రామలింగారెడ్డి, సర్పంచ్ పూజితారెడ్డి



పెదపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మాదేవి



పెదకూరపాడులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన అందిస్తున్నామని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ చెప్పారు. పట్టణంలోని 19, 20 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష క్యాంపును గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ మాట్లాడుతూ ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదనే ఉన్నత లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ప్రవేశపెట్టారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో అధికారులు ఇళ్లకు వెళ్లి వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందించటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డులకు సంబంధించి 572 మందికి ధ్రువపత్రాలు అందించారు. కౌన్సిలర్లు కూకుట్ల లక్ష్మి, అవ్వారు శ్రీనివాసరావు, అచ్యుత శివప్రసాదరావు, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్, కో-ఆప్షన్ సభ్యుడు సహారా మౌలాలి, తుమ్మల వెంకటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, కౌన్సిలర్ ఆకులరమేష్, శెట్టిఆనంద్, తోట వెంకటేశ్వరరావు, గని, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బొల్లవరంలో...

బొల్లవరం(ముప్పాళ్ళ): జగనన్న సురక్షతో అన్ని వర్గాలకూ మేలని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి చెప్పారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో గురువారం జరిగిన జగనన్నసురక్ష క్యాంపులో పాల్గొని అర్హులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమపథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉండాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీరు వ్యవస్థ, సచివాలయవ్యవస్థను ఏర్పాటు చేసి అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మొత్తం 227 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కందివిత్తనాలు అందించారు. సర్పంచ్ బద్దిగం పూజితారెడ్డి, తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శిరిగిరిగోపాలరావు, బద్దిగం వెంకటరెడ్డి, బ్రహ్మారెడ్డి, నక్కా శ్రీనివాసరావు, రంగమోహన్‌రెడ్డి, పీలా లక్ష్మయ్య, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెదపాలెంలో...

అచ్చంపేట: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సీహెచ్ పద్మాదేవి తెలిపారు. జగనన్న సురక్షకార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదపాలెంలో గురువారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులనుంచి సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. గ్రామంలో మొత్తం 117మందికి టోకెన్స్ ఇవ్వగా వాటిలో 37మందికి ఆదాయం, 39మందికి కులం, 40మందికి కౌలురైతు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. 10మంది రేషన్ కార్డులో తమ పిల్లల పేర్లు కలపడానికి దరఖాస్తు చేసుకోవడంతో వారి రేషన్ కార్డులను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. నలుగురికి కుటుంబ సభ్యుల సర్టిఫికెట్స్ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ సర్పంచ్ నెల్లూరి హరిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, ఎంపీటీసీ నెల్లూరి శివకుమారి, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చిరుమామిళ్ల నరసింహారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిగురుపాడులో...

మండలంలోని చిగురుపాడులో ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 112మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వాటిలో కులం 32, ఆదాయం 33, కౌలురైతు కార్డులు 5, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు 4 ఉన్నాయి. ఎంపీటీసీ కనిగిరి మహేశ్వరి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆకుల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇమ్మానియేలు, శివకృష్ణ పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మొత్తం 90మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.క్షమారాణి, సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ షరీఫ్, ప్రత్యేక అధికారి ధనలక్ష్మి, ఎంపీడీఓ క్రొత్తపల్లి నరసింహారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన సదస్సు



రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ

ముప్పాళ్ళ: చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని, అపరాల పంటలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని బొల్లవరం గ్రామంలోనీ ఎస్సీకాలనీలో దళిత బహుజన రీసోర్సుసెంటర్ ఆధ్వర్యంలో చిన్న, సన్నకారు రైతులకు సుస్థిర వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు డీబీఆర్సీ ఏరియా కో-ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు ప్రభుత్వం అందించే సీసీఆర్సీ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే రైతుభరోసా సాయం, బ్యాంక్ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, పురుగుమందులు పొందే అవకాశం ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడి పెట్టే విధంగా పాత పద్ధతిలో గేదెల పేడ, మేకల ఎరువు, వేపపిండి కలిపి పంట వేయకముందే పొడి దుక్కిపై చల్లినట్లయితే భూమిలో సూక్ష్మజీవులు ఉత్పత్తి అవుతాయని, విత్తనాలు వేసిన తర్వాత మొక్క ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. పురుగుమందులు ఎక్కువగా వాడకుండా జీవామృతం తక్కువ పెట్టుబడితో రసాయనాలు తయారు చేసుకొని పిచికారీ చేసుకున్నట్లయితే ఆదాయం పెంచుకోవచ్చు. వీఏఏ శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని పల్నాడు జిల్లా దళిత బహుజన రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రౌతులు ప్రభుత్వం పంట సాగుదారుల చట్టం ద్వారా ఇస్తున్న సీసీఆర్సీ కార్డులు పొంది రైతు భరోసా, బ్యాంకు రుణాలను ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీపై పొందాలని తెలిపారు. మండల ఏరియా కో-ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, ఏపీఎం సునీత, ఏపీఓ చెవుల వెంకటేశ్వర్లు, కౌలు రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల వికాసంపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారులకు సైకిళ్లు బహూకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కారెంపూడి: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల శారీరక, మానసిక వికాసం పట్ల అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు తహసీల్దార్ తన సొంత నగదుతో గురువారం ఏడు చిన్న సైకిళ్లను బహూకరించారు. చిన్నారుల శారీరక వికాసం కోసం తహసీల్దార్ వీటిని చిన్నారులకు అందించారు. వయస్సుకు తగ్గట్లుగా చిన్నారులు ఎత్తు, బరువు పెరిగేలా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించి, దానికి తగినట్లుగా వారి శారీరక మానసిక వికాసానికి అవసరమైన కృత్యాలు చేయించాలని, వారిలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా మంచి కథలతో కూడిన ప్రీప్రైమరీ విద్య ఉండాలని సూచించారు. ప్రాథమిక విద్యకు వారిని ఇక్కడ సమర్థవంతంగా సిద్ధం చేస్తే పాఠశాలలో వారు చూపే ప్రతిభ అద్భుతంగా ఉంటుందన్నారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను తహసీల్దార్ శుభ్రం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

చదరంగంతో జ్ఞాపకశక్తి మెరుగు




చెస్ కోచ్ కిరణ్‌ను సత్కరిస్తున్న అర్బన్ సీఐ టి.బాలకృష్ణ

మాచర్ల: చదరంగం ఆటతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని అర్బన్ సిఐ టి.బాలకృష్ణ అన్నారు. గురువారం ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ, లక్ష్మీచెన్నకేశవ మాచర్ల క్లబ్‌ల ఆధ్వర్యంలో పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కె.క్రాంతి కిరణ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న మేధాశక్తిని బయటకు తీసేందుకు చెస్ క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందని, వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ఎంతో మంది విద్యార్థులకు చెస్ క్రీడను నేర్పించి వారికి రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించి పెట్టిన చెస్ కోచ్ కిరణ్ క్రీడా స్ఫూర్తి, సేవా గుణం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, మేడా వెంకట లక్ష్మి, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు, ముప్పవరపు నాగేశ్వరరావు తదితరులున్నారు.

మాచర్ల: చరిత్రలో అత్యంత పురాతనమైన ఆట చదరంగం అని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బ్రాంచి డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ అన్నారు. గురువారం ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థుకు చెస్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అండర్ 11 బాలికల్లో దీక్షితరెడ్డి, బాలురులో అక్షిత్‌వర్ధన్, అండర్ 13 బాలికల్లో యువశ్రీలు మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు కూలీలు ఆధార్ అనుసంధానం చేయాలి



సదస్సులో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: ఉపాధి పథకంలో జాబ్‌కార్డు కల్గిన కూలీలు తప్పనిసరిగా ఆధార్‌కు అనుసంధానం చేయాల్సిన ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై ఉందని వినుకొండ క్లస్టర్ ఏపీడీ ఈవూరి బూసిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల 38 వేల 349 మంది కూలీలకు పనిదినాల కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 2 లక్షల 10 వేల 523 మందికి పనిదినాలు కల్పించామన్నారు. మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా ప్రస్తుతం 6 పంచాయతీల్లో కూలీల వివిధ రకాల పనులు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో బొల్లాపల్లి, వినుకొండ, నూజెండ్ల మండలాల్లో రోజుకు 3 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన చిన్న-సన్నకారు రైతులందరూ నీటి వసతి ఆధారంగా ఉద్యాన పంటల సాగు వైపు ఆసక్తి చూపాలన్నారు. ఈ సాగు చేసిన ఒక్కో రైతుకు మూడు సంవత్సరాల సాగు ఆధారంగా రూ.1.50 వేల రూపాయలు ఉపాధి పథకం మంజూరు చేస్తుందన్నారు. మండలంలోని శానంపూడి గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్కపోగు పెద గంగయ్య 2021 ఆగస్టు నెల నుంచి విధుల్లోకి హాజరు కాకపోవడంతో పాటు వేతనం నిలుపుదల చేశామని, సీనియర్ మెట్ పర్యవేక్షణలో గ్రామంలో ఉపాధి పనులు చేయిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీ కొని వ్యక్తి మృతి



మాచర్ల రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొనటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాయవరం గ్రామ జంక్షన్‌లో గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయవరం జంక్షన్‌లో కెఎస్‌ఆర్ నగర్ వద్ద రోడ్డు దాటుతున్న ముఖేష్(30)ను రాయవరం వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో రోడ్డుపై పడ్డ ముఖేష్ తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. మృతుడుముఖేష్ జాతీయ రహదారుల పని నిమిత్తం బిహార్ రాష్ట్రంలోని, జమ్ము జిల్లా, వరియా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

• నూతన వైద్యాధికారిగా రాధాకృష్ణన్

శావల్యాపురం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా యం.రాధాకృష్ణన్ నియమాకం అయినట్లు ఆరోగ్య కేంద్రం డ్రాయింగ్ అధికారి వేముల వెంకట భాస్కర్ గురువారం తెలిపారు. నూతన వైద్యాధికారి రేపల్లె మండలం ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై వస్తున్నట్లు చెప్పారు.